
# ద్రోహం

రేణిగుంట కార్తీక్

భానోదయమయ్యాక మూడు గంటలు గడిచాయి.

యూనివర్సిటికి దగ్గర్లోని ఓ ఎయిర్కండిషన్డ్ రెస్టారెంట్,డిజైనర్ దుస్తులతో, అల్ట్రా మోడ్రన్ గా అలంకరించుకున్న అమ్మాయిలతో, వాళ్ల కోసం ఎదురుతెన్నులు పడ్తున్న అబ్బాయిల అల్లరితో కళకళలాడుతోంది.

సరిగ్గా ఆ సమయంలో అక్కడికొచ్చి ఆగింది ఓ ఆటో.



బంగారంతో పోతపోసినట్టున్న గ్రీక్ శిల్ప సౌందర్యాన్ని, నీలిరంగు జీన్స్ ప్యాంటు, స్లీవ్ లెస్ టాప్ తో ప్యాక్ చేసినట్టున్న ఓ లావణ్యం ఆటోలోంచి దిగి, ఫేర్ చెల్లించి, వడివడిగా రెస్టారెంట్లోకి అడుగుపెట్టింది. అప్పటివరకు కోలాహలంగా వున్న రెస్టారెంట్ క్షణం పాటు నిశ్శబ్దంగా మారింది.

అందరూ, ఓ క్షణం పాటు ఆ సౌందర్యాన్ని కళ్లతో పలకరించి, తమకలవాటైన చిరునవ్వును స్వీకరించి, మళ్ళీ తమ లోకంలోకి జారిపోయారు.

ఆ సౌందర్యం పేరు మధుమతి!

వైరాలజీ సబ్జక్టులో డాక్టరేట్ కోసం రీసెర్చ్ చేస్తున్న స్కాలర్.

తమ కలవాటైన కార్నర్‌లో, అల్పాహారం చేస్తూ, తన కోసం ఎదురుచూస్తున్న నేస్తం స్నేహలత కనిపించడంతో ఆ టేబుల్ దగ్గరకు నడిచింది. అప్పటికే, అల్పాహారం తినడం పూర్తవడంతో మధుమితను పలకరించి తనకు అత్యవసరమైన పనుందని, పావు గంటలో తిరిగొస్తానని, అప్పటి దాకా రెస్టారెంట్లో తన కోసం వేచి వుండమని చెప్పి, హడావుడిగా బయటకెళ్ళిపోయింది స్నేహలత.

మధుమిత బేరర్‌కి ఆర్డర్ చెప్పి, ఆ టేబుల్ దగ్గరే కూర్చుని, హడావుడిలో తన నేస్తం మరచిపోయిన పుస్తకాన్ని గమనించి దాన్ని, తిరగేస్తూండగానే టిఫిన్ రావడంతో, పుస్తకాన్ని తిరగేస్తూ మెల్లగా తినడం ప్రారంభించింది.

సరిగ్గా అప్పుడు జరిగిందా సంఘటన!!

దబ్ మన్న పెద్ద శబ్దంతో మనిషికూలిన చప్పుడుకి రెస్టారెంట్లో వున్న వాళ్ళందరూ తలలు తిప్పి అటుకేసి చూసారు. మరుక్షణం వాళ్ళందరూ కత్రాటల్లా బిగుసుకుపో

యారు. కారణం అక్కడ కనిపించిన దృశ్యానికి అందరూ నిశ్చేష్టులయ్యారు.

మధుమిత టేబుల్ పై ఒరిగిపోయివుంది!

క్షణం తర్వాత, అందరూ ఆదుర్దాగా ఆ టేబుల్ చుట్టూ గుమిగూడారు. ఆ గుంపులోంచి తేరుకున్న ఓ వ్యక్తి ''ప్లీజ్! అందరూ పక్కకు జరగండి. నేను డాక్టర్ని నన్ను చూడనివ్వండి'', అంటూ అందర్నీప్రక్కకు జరిపి, మధుమితను పరిశీలించి, ''ఓహ్! గాడ్...షీ ఈజ్ డెడ్'' అన్నాడు.

మరుక్షణం చేష్టలుడిగి పోయిన జనం కట్రాటల్లా బిగుసుకుపోయారు.

అందరి ముఖాల్లోనూ భీతి ఒక్కసారిగా తన్నుకొచ్చింది.

అందరికన్నా ముందుగా తేరుకున్న రెస్టారెంట్ యజమాని ఈ తలనొప్పిని ఎలాగోలా వదిలించుకోవాలని పనివాళ్ళను కేకలేసి, ''అంబులెన్స్ ని పిలవండి...త్వరగా...'' అన్నాడు.

''పిలవాల్సింది అంబులెన్స్ని కాదు.పోలీసుల్ని'' జనంలోంచి ఎవరో అరిచారు.

మరుక్షణం రెస్టారెంట్ యజమాని ముఖం తెల్లగా పాలిపోయింది. గజగజా వణికిపోతూ అన్నాడు ''పోలీసులెందుకు? ఈ అమ్మాయిని హాస్పిటల్కి తీసుకెళితే బ్రతుకుతుందేమో?''

''అంటే, శవానికి ప్రాణంపోసే హాస్పిటల్ హైదరాబాదులో వుందా?''

అతని ముఖంలోని భయాన్ని పసికట్టిన కొందరు, కావాలనే అన్నారు.

అతనేదో చెప్పబోయేంతలోనే, డాక్టర్ కలగచేసుకుని ''ముందు పోలీసులకు తెలియచేయండి'' అన్నాడు. అతని వాక్యం పూర్తికాకముందే ఓ అత్యుత్సాహపరుడు, పోలీసులకు ఫోన్ చేశాడు.

సరిగ్గా అప్పుడు అక్కడికి ప్రవేశించింది స్నేహలత.

గందరగోళంగా వున్న రెస్టారెంట్లో జరిగిందేమిటో తెలియక, అచేతనంగా పడివున్న తన స్నేహితురాలి దగ్గరకెళ్లి, కంగారుగా, ఏం జరిగిందని చుట్టూవున్నవార్ని విచారిస్తూవుండగానే, పోలీసులు రంగప్రవేశం చేశారు.

''ఎవరీ అమ్మాయి?'' శవం దగ్గర నిల్చుని రోదిస్తున్న స్నేహలతను అడిగాడు ఇన్స్పెక్టర్.

''నా స్నేహితురాలు పేరు మధుమిత'' కన్నీటిని చేతిరుమాలుతో తుడుచుకుంటూ చెప్పింది.

''ఎలా చనిపోయింది?'' ఆమె నాడిని పరీక్షిస్తూ, అక్కడి పరిసరాలను ఓరకంటితో గమనిస్తూ అడిగాడు ఇన్స్పెక్టర్. తామెప్పుడూ ఇక్కడే కలుసుకుని, టిఫెన్ చేసాక, యూనివర్శిటీకెళతామని, ఆ రోజు కూడా అలాగే కలుసుకున్నామని, ఐతే తను బయటకెళ్లి, ఫోన్ చేసుకుని వచ్చేలోపునే ఏం జరిగిందో తనకూ తెలియదని వెక్కిళ్ళ మధ్య తెలియచేసింది స్నేహలత.

రెస్టారెంట్ యజమానిని, మధుమితకు టిఫెన్ సప్లై చేసిన సప్లైర్ను ప్రశ్నించి తన అనుమతి లేకుండా ఊరు వదలి వెళ్ళరాదని హెచ్చరించి, మధుమిత తిని మిగిలిపోయిన ఆహారాన్ని సీజ్ చేయించి, ఫోరెన్సిక్ నిపుణులు, పోలీస్ ఫోటోగ్రాఫర్స్ తమ పనులు ముగించాక బాడీని ఆసుపత్రికి తరలించారు పోలీసులు.

స్నేహలత ఆ బల్లపై వున్న తన పుస్తకాన్ని తీసుకుని, బాడీతో పాటు అంబులెన్స్లో ఎక్కికూర్చుంది. పోలీసు జీపు, అంబులెన్స్ ఆసుపత్రి వైపుకు పరుగులు తీశాయి. అప్పటిదాకా, రెస్టారెంట్ కెదురుగా రోడ్డుకవతల, సన్ ఫిల్మ్ గ్లాసుల్ని మూసి పార్క్ చేసివున్న కారు లోంచి ఈ తతంగమంతా గమనిస్తున్న ఓవ్యక్తి, కారును వేగంగా నడుపుకుంటూ వెళ్ళిపోయాడు.

అతని పేరు సతీష్!

మధుమిత గాఢంగా ప్రేమించిన వ్యక్తి!!

***

ఇన్స్పెక్టర్ విక్రమ్ తన ఎదురుగా కూర్చున్న స్నేహలతను నిశితంగా పరిశీలిస్తూ అడిగాడు, ''ఐతే మధుమితకు సంబంధించిన వాళ్ళెవ్వరూ ఈ దేశంలో లేరంటావ్?''

''అవును సార్ తల్లి చిన్నతనంలోనే చనిపోతే హాస్టల్లో వుండి చదువుకుంది. తండ్రి విభూషణ్ రావు అమెరికాలో వుంటారు'' గద్గద స్వరంతో చెప్పింది.

''ఆయన టెలిఫోన్ నెంబర్ గానీ, అడ్రస్ గానీ తెలుసా?''

''ఊహూ! టెలిఫోన్ నెంబర్ మధుమిత సెల్లో వుండొచ్చు సార్''

తన టేబుల్పై వున్న మధుమిత బ్యాగును అందుకుని, అందులోని వస్తువుల్ని, ఒక్కొక్కటీ బయటికి తీసాడు విక్రమ్... ఓ లిప్స్టిక్, బొట్టుబిళ్ళల పాకెట్, సేఫ్టీపిన్స్, ఓ నోటుబుక్, వైరాలజీకి సబ్జెక్ట్కి సంబంధించిన కొన్ని థీసీస్ పేపర్స్, నోకియా సెల్ ఫోన్ వున్నాయందులో. సెల్ఫోన్ తీసుకుని అందులో విభూషణ్ రావు నెంబర్ కై వెదికాడు.

అందరి ముఖాల్లోనూ భీతి ఒక్కసారిగా తన్నుకొచ్చింది. అందరికన్నా ముందుగా తేరుకున్న రెస్టారెంట్ యజమాని ఈ తలనొప్పిని ఎలాగోలా వదిలించుకోవాలని పని వాళ్ళను కేకలేసి, ''అంబులెన్స్ ని పిల వండి...త్వరగా'' అన్నాడు.

అతనికి కావలసిన నెంబర్ దొరకడంతో, వెంటనే రింగ్ చేసాడు.కొన్ని క్షణాల తర్వాత, అవతల టెలిఫోన్ తీసాక, ''హలో... విభూషణ్ రావుగారా?'' అని పలకరించాడు.

''అవును మీరెవరూ?'' అవతలి గొంతు సమాధానం చెప్పాక,నింపాదిగా చెప్పాడు తనెవరో ఎందుకై ఫోన్ చేసాడో. ఆ తర్వాత, అవతలి గొంతు యిచ్చిన సమాధానంతో ఇన్స్పెక్టర్ విక్రమ్ ముఖం వివర్ణమైంది. అవతల లైన్ కట్ అయింది. అతని ముఖకవళికల్లోని మార్పుని గమనించిన స్నేహలత అడిగింది ''ఏమయింది సార్?''

సెల్ ఫోన్ను బల్ల పై వుంచి, గంభీరంగా చెప్పాడతను ''మధుమిత ఎవరో తనకు తెలియదని అంటున్నాడు''.

స్నేహలత నిర్ఘాంతపోయింది.

విక్రమ్ లేచి అటూ, ఇటూ తిరుగుతూ సాలోచనగా అడిగాడు ''మధుమిత హాస్టల్ కెళ్లి ఆమె రూం చెక్ చేయాలి. అందుకు మీ సహకారం కావాలి''.

''తప్పకుండా సార్! పదండి వెళదాం'' లేచి నిలుచుంటూ అంది స్నేహలత.

ఇద్దరూ పోలీస్ స్టేషన్ నుండి బయలుదేరారు.

అప్పటిదాకా పోలీస్ స్టేషన్ ఎదురుగా పార్క్ చేసివున్న కారులో కూర్చుని న్యూస్ పేపర్ చదువుతున్నట్టు నటిస్తున్న వ్యక్తి మరుక్షణం తన కారుని ముందుకురికించాడు.

ఆ వ్యక్తి మధుమితకు గైడ్ గా వ్యవహరిస్తున్న యాభై ఏళ్ళ ప్రొఫెసర్ పరబ్రహ్మం..!

ఆమెను లైంగికంగా వేధించి, భంగపడి, మధుమిత వల్ల యూనివర్శిటీలో అందరి ఎదుటా దారుణంగా అవమానం పాలై, మధుమిత పై కసి తీర్చుకునేందుకు అదనుకై ఎదురుచూస్తున్న మేకవన్నెపులి.

***

హాస్టల్ వార్డెన్ సహాయంతో, మధుమితగదిలోకి ప్రవేశించారు. విక్రం, స్నేహలత. గదిని విక్రం పరిశీలనగా చూసాడు. శుభ్రంగా, ఆర్టిస్టిక్గా, అందంగా వుంది. తూర్పు వైపు వున్న గోడకు వేంకటేశ్వరస్వామి పటం తప్ప ఎలాంటి ఫోటోలు లేవు. ఆ గదిలో, యవ్వనంలో వున్న పెళ్ళికాని ఓ అమ్మాయి నివాసం వుండేదంటే ఎవరూ నమ్మరు. ఓ మూల పుస్తకాల రేక్, ఓ కంప్యూటర్ టేబుల్, మరో వైపు చిన్న సైజ్ రిఫ్రిజిరేటర్, దానిపై ఫ్లాస్క్, శుభ్రంగా కడిగి పెట్టిన అరడజను కప్పులు వున్నాయి. గోడకున్న అలమారలో ఐరన్ చేసిన బట్టలు హేంగర్స్కి వేలాడుతున్నాయి. అలమారలోని క్రింది రేక్లో వున్న డైరీపై పడిందతని దృష్టి. దాన్నందుకుని రెండు పేజీలు తిరగేసాక, అతని భృకుటి ముడిపడింది.

మొదటి పేజీలో ''ప్రేమతో... నీ... సతీష్'' అన్న వాక్యాలు తప్ప మరేమీ లేదా డైరీలో.

''ఎవరీ సతీష్?'' అడిగాడు విక్రం.

''మా క్లాస్ మేట్'' చెప్పింది స్నేహలత.

''వాళ్ళిద్దరు ప్రేమికులా?''

''అబ్బే అలాంటిదేమీ లేదండి. జస్ట్ ఫ్రెండ్స్ అంతే!'' స్నేహలత కొద్దిగా తత్తరపడటం అతని దృష్టిని మించి పోలేదు. కంప్యూటర్ ముందున్న కుర్చీలో కూర్చుని, సిస్టంని ఆన్ చేసాడు. డెస్క్ టాప్ పై దాదాపు ఓ యాభైయేళ్ళ వయస్సున్న వ్యక్తి ఆప్యాయతతో మధుమితను పొదివి పట్టుకున్న ఫోటో కనిపించిందతనికి. బహుశా తండ్రి విభూషణ్ రావు కావచ్చు. అదే అడిగాడు స్నేహలతను. తను ఎప్పుడూ అతన్ని చూడలేదని చెప్పింది స్నేహలత. విక్రం కంప్యూటర్ లోని ఈ మెయిల్స్ చూడడం మొదలెట్టాడు. చాలా వరకు కరెస్పాండెన్స్ సతీష్తో స్వీట్ నథింగ్సే వున్నాయి. కొన్ని హైడ్ చేసిన ఈ మెయిల్స్ చాలా ప్రయత్నించిన మీదట ఓపెన్ అయ్యాయి. అవన్నీ మధుమిత,

విభూషణ్ రావుల మధ్య జరిగిన కరస్పాండెన్సే.

విక్రం ఓ నిర్ణయానికి వచ్చినవాడిలా విభూషణ్ రావుకి మధుమితది సహజ మరణం కాదని, ఆమెనెవరో పకడ్బందీగా ప్లాన్ చేసి చంపారని, ఆస్తికై దాయాదులే ఆ పని చేసి వుండే అవకాశం వుండవచ్చని, పోలీసులు ''మీ రెండో భార్య సంతానంపై అనుమానం వ్యక్తం చేస్తున్నారని యిదంతా మీడియా ద్వారా పబ్లిసిటీ కాకముందే, ఇక్కడికి మీరు రావడం మంచిదని'' ఈ మెయిల్ పంపించాడు. చీకట్లో బాణం వేసాడు. తగిలితే తగలొచ్చిని అతని ఆలోచన. కంప్యూటర్ పాస్వర్డ్ మార్చి క్లోజ్ చేసాడు. తను పాస్వర్డ్ మార్చినప్పుడు స్నేహలతకు తెలియకుండా జాగ్రత్తపడటం అతను మరచిపోలేదు.

***

పోలీస్ స్టేషన్లో మధుమిత మరణానికి సంబంధించి వచ్చిన మెడికల్ అనాలసిస్ రిపోర్ట్సును పరిశీలిస్తున్న విక్రంకి ఆమెది సహజ మరణం కాదని, విషాహారం వల్ల జరిగిందని తెలిసింది. ఐతే, విచిత్రంగా, ఆ రోజు తిన్న ఆహారంలో విషం లేదని, మరణించే సమయానికి ఆమె గర్భవతి అని ఫోరెన్సిక్ రిపోర్టు రావడంతో అతని భృకుటి ముడిపడింది. ఎవరో ఆమెని పకడ్బందీగా ప్లాన్ వేసి చంపారు

ఎవరూ? ఎందుకు?

సరిగ్గా అప్పుడు మ్రోగింది టెలిఫోన్.

స్నేహలత! ఫోన్లో ఆమెతో మాట్లాడాక, వెంటనే బయలుదేరుతున్న విక్రం మళ్ళీ ఫోన్ రింగవడంతో వెనక్కి తిరిగి, ఫోన్ లిఫ్ట్ చేసాడు. అవతలి వ్యక్తి ఓ సమాచారం అందించాడు.

''నువ్వెవరు?'' అని ప్రశ్నించే లోపునే ఫోన్ డిస్కనెక్ట్ అయింది. మరుక్షణం మోటర్ బైక్ పై వేగంగా బయలుదేరాడు.

***

యూనివర్శిటీ ప్రాంగణం!

అతనికై ఎదురు చూస్తున్న స్నేహలత చిరునవ్వుతో పలకరించి, వైరాలజి డిపార్ట్మెంట్ వైపుకి దారితీస్తూ గతంలో ప్రొఫెసర్ పరబ్రహ్మం, మధుమితను లైంగికంగా వేధించడం, ఆమె అతన్ని అందరిముందూ అవమానించడంతో, కోపంగా ఆమెను అంతం చేస్తానని ప్రొఫెసర్ పరబ్రహ్మం చెప్పడం అతనికి తెలియచేసింది. ''ప్రొఫెసర్ పరబ్రహ్మం'' అని వున్న నేం ప్లేట్ గదిలోకి ప్రవేశించారిద్దరు.

మరుక్షణం.. వెయ్యి ఓల్టుల విద్యుత్తు తమ శరీరాల్లోకి ఒక్కసారిగా దూసుకుపోయినట్లు షాకయ్యారు.

ఆ గదిలో ప్రొఫెసర్ పరబ్రహ్మం మృతదేహంకనిపించింది.

వెంటనే నాడి పరిశీలించిన విక్రంకి అతని శరీరం ఇంకా వేడిగానే వుండటంతో, అతను చనిపోయి కొద్దిక్షణాలే అయివుంటుందని గ్రహించాడు. మరుక్షణం తీసుకోవలసిన చర్యలను వెంటనే మొదలెట్టాడు.

***

ఇన్స్పెక్టర్ విక్రం సతీష్ ఇంటి ముందు మోటర్ బైక్ పార్క్ చేసి తలుపులు మూసి వుండటంతో బజర్ నొక్కాడు. కాసేపటి తర్వాత, సుమారు నలభై ఏళ్ళ స్త్రీ తలుపులు తెరిచి, ఎదురుగా వున్న ఇన్స్పెక్టర్ని చూసి కంగారుగా అడిగింది, ''ఏం కావాలి?''

ఇన్స్పెక్టర్ విక్రం తనను పరిచయం చేసుకుని, సతీష్ గురించి అడిగాడు. తను సతీష్ తల్లినని, తన భర్తతో పాటు వ్యక్తిగత పనులపై వారం క్రితం స్వగ్రామం వెళ్ళారని, ఎప్పుడొస్తారో తెలియదని, ఐనా తన కొడుకుతో పోలీసులకేంపనని అడిగింది. ఆమె చెప్పింది పచ్చి అబద్ధమని గ్రహించి నిజం రాబట్టడానికై పోలీసు స్టైల్లో అడిగాడు విక్రం.

''మీకు మధుమిత అనే అమ్మాయి తెలుసా?''

మరుక్షణం ఆమె ముఖం తెల్లగా పాలిపోయింది.

''తె... తెలుసు... మా అబ్బాయి క్లాస్ మేట్'' వణుకుతున్న స్వరంతో ఆమె బదులివ్వడం అతను గుర్తించాడు. ఆమెను మరింత బెదరగొట్టడానికి గంభీరమైన స్వరంతో చెప్పాడు.

''మీ అబ్బాయి, మధుమితను గర్భవతిని చేసి ఆమెను హత్యచేసాడు. అతన్ని వెంటనే పోలీసులకు లొంగిపొమ్మని చెప్పండి. లేకపోతే, పాతాళలోకంలో దాక్కున్నా నేనతన్ని పట్టుకుంటాను'' ఇప్పుడామె ముఖంలో భీతి కనిపిస్తోందనికి. కాస్త, తేరుకుని కోపంగా అడిగింది.

''ఆ పని చేసింది మా అబ్బాయే అని ఏమిటి ఆధారం?''

ఈసారి మళ్ళీ చీకట్లోకి బాణం వేసాడు విక్రం ''వాళ్ళిద్దరి మధ్యా నడిచిన ప్రేమాయణం మీకు నచ్చక పోవడం, వారిపెళ్ళికి మీరు అంగీకరించక పోవడం, మధుమితను మీరు పిలిచి తీవ్రంగా హెచ్చరించడం ఆమెను మీరు, మీవారు కలిసి అడ్డు తొలిగించుకునేందుకు పథకం వేయడం సతీష్ ఫ్రెండే చెప్పాడు. చాలా ఇంకేమయినా ఆధారాలు కావాలా?''

మరుక్షణం ఆమె షాక్తో కుప్పకూలిపోయింది.

***

విక్రం తన ఆఫీస్ గదిలో కూర్చుని, ప్రొఫెసర్ పరబ్రహం మరణం తాలుకు రిపోర్ట్స్ పరిశీలిస్తున్నాడు. మరుక్షణం అతని కళ్ళు పత్తికాయల్లా విచ్చుకున్నాయి. అతని మరణం కూడా విషప్రయోగం వల్లే జరిగింది. గుండుసూదిని సెనైడ్లో ముంచి, మోచేతిపై గుచ్చడంవల్ల అతనికి మరణం సంభవించింది. ఐతే పెనుగులాట జరిగినట్లుగాని, అడ్డుకున్నట్లుకాని లేదని వుందందులో. అంటే, హంతకుడు అతనికి బాగా తెలిసినవాడైతే తప్ప యిలా జరిగే అవకాశం లేదు. మధుమిత మరణం కూడా సెనైడ్ వల్లే జరిగింది. మధుమిత కేసుకు సంబంధించిన రికార్డ్స్, ఫోటోలు చూస్తున్న అతనికి ఎక్కడో ఏదో మిస్సవుతున్న ఫీలింగ్.

ఓ ఫోటోలో మధుమిత ఒరిగిపోయిన ఎడమ చేతి క్రింద ఓ పుస్తకం కనిపించింది. ఐతే, సీజ్ చేసిన వస్తువుల్లో ఆ పుస్తకం లేదు. ఆ పుస్తకాన్ని భూతద్దంలోంచి చూసాక యూనివర్శిటీ తాలూకు ముద్ర, బుక్ నెంబర్ కనిపించింది. హెడ్కానిస్టేబుల్ వేదాచలానికి చెప్పాడతను ఏం చేయాలో. మరుక్షణం వేదాచలం లాగిపెట్టిన బాణంలా ఆ గదిలోంచి బయటకెళ్ళిపోయాడు.

***

తన తల్లితండ్రులతో పోలీస్టేషన్లోకి అడుగుపెట్టిన సతీష్ నేరుగా ఇన్స్పెక్టర్ విక్రం గదిలోకి ప్రవేశించాడు.

సతీష్ ముఖంలో భీతి కొట్టొచ్చినట్లు కనపడుతోంది అతన్ని మరింత భయపెట్టి విషయం బయటకు లాగడానికై అడిగాడు విక్రం.

''ఎందుకు చంపావా అమాయకురాలిని? నిన్ను ఉరికంబం ఎక్కించేంత వరకు నేను నిద్రపోను.'' అతని స్వరంలోని కరకుతనాన్ని గుర్తించిన సతీష్ వెంటనే రోదిస్తూ కుప్పకూలిపోయి చెప్పాడు. ''ప్రాణప్రదంగా ప్రేమించిన అమ్మాయిని నేనెందుకు చంపుకుంటాను సార్? మా తల్లితండ్రులకు యిష్టం లేకపోయినా, నేను తననే పెళ్లిచేసుకుంటానని వాళ్ళకు కరాఖండిగా చెప్పాను. ఈ విషయంగా మా ఇంట్లో గొడవైతే, నేను మధుమితకు ఈ విషయం చెప్పి, మా పెళ్ళి ఏర్పాట్లు చేసుకోవాలని తనతో మాట్లాడానికై ఆ రోజు రెస్టారెంటుకొచ్చాను. ఐతే ఆమెతో స్నేహలత వుండటంతో ఏకాంతంగా మాట్లాడటానికి కుదరలేదు. తన ముందు మాట్లాడితే, మా ఇంట్లో విషయం తెలిసిపోతుందనే భయంతోనే నేనలా ప్రవర్తించాల్సి వచ్చింది.''

''కానీ స్నేహలత దాదాపు పదినిమిషాలు ఫోన్ చేయడానికి బయటకొచ్చిందిగా. ఆ సమయంలో నువు ఆమెతో మాట్లాడి వుండొచ్చుగా?'' అనుమానంగాఅడిగాడు విక్రం. ''నో...సర్... ఆ అమ్మాయి ఆ సమయంలో కార్లో నాతో మాట్లాడుతూ కూర్చుంది. ఐనా తన చేతిలో సెల్ వుండగా ఫోన్ చేయడానికి బయటకు రావడం ఎందుకు? రెస్టారెంట్లో గొడవేదో జరుగుతోందని నాకు చెప్పి వెళ్లిపోయింది''. చెప్పాడతను. ఐతే స్నేహలత తనతో అబద్ధం చెప్పిందన్న మాట. తన ఆలోచనల్ని వారు పసికట్టకుండా జాగ్రత్త పడుతూ అన్నాడు విక్రం.

''ఐతే తమరు ఇద్దరితో ప్రేమాయణం సాగిస్తున్నారన్నమాట'' వ్యంగంగా అన్నాడు విక్రం.

''నో...సర్! నేను మధుమితనే ప్రేమించాను. కానీ...'' అతని మాటల్ని కట్ చేస్తూ అన్నాడు విక్రం, ''స్నేహలత మాత్రం నిన్ను ప్రేమించింది. పెళ్ళాడుతానంది. అందుకు మీ తల్లితండ్రులు కూడా ఒప్పుకున్నారు'' చిరునవ్వుతో చెప్పాడు విక్రం.

''వాళ్ళిద్దరి మధ్యా నడిచిన ప్రేమాయణం మీకు నచ్చక పోవడం, వారిపెళ్ళికి మీరు అంగీకరించక పోవడం, మధుమితను మీరు పిలిచి తీవ్రంగా హెచ్చరించడం ఆమెను మీరు, మీవారు కలిసి అడ్డు తొలిగించుకునేందుకు పథకం వేయడం సతీష్ ఫ్రెండే చెప్పాడు. చాలా ఇంకేమయినా ఆధారాలు కావాలా?''

''ఇట్స్ ఓకె రిలాక్స్ స్నేహలత సెల్ నెంబర్ని డయల్ చేసి వెంటనే ఇక్కడికి రమ్మను'' చెప్పాడు విక్రం. వెంటనే తన సెల్ నుండి స్నేహలతకు ఫోన్ చేసి అవతల స్విచ్ ఆఫ్ చేసివుందని చెప్పాడు సతీష్.

గంట తర్వాత వేదాచలం, విక్రంకి టెలిఫోన్ చేసి చెప్పాడు. ఫోటోలోవున్న వైరాలజీకి సంబంధించిన పుస్తకం, స్నేహలత, లైబ్రరీ నుండి డ్రా చేసిందని, తిరిగి, మొన్న, అంటే హత్య జరిగినరెండోరోజన్న మాట ఆ పుస్తకాన్ని వాపసు చేసిందని, ఐతే విచిత్రంగా ఆ పుస్తకం నిన్నటి నుండి కనబడటంలేదని లైబ్రేరియన్ అంటున్నాడని, ఇంకా ఆపుస్తకం కోసం వెదుకుతునే వున్నానని చెప్పాడు.

వెంటనే అలర్టయిన విక్రం వేదాచలానికి చెప్పాడేంచేయాలో

మరో గంట గడిచాక, సగం కాలిన లైబ్రరీ పుస్తకంతో పాటు స్నేహలతని ఇద్దరు లేడీ కానిస్టేబుల్స్ తో పాటు వెంటబెట్టుకుని వచ్చేడు వేదాచలం. ఆమె ముఖంలో భయం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది.


''వెల్కం మైడియర్ స్నేహలత. చాలా చక్కగా ప్లాన్ వేసి నీస్నేహితురాల్ని చంపినందుకు కంగ్రాట్స్. ఎందుకు హత్య చేసావోనువ్వే చెబుతావా? లేకపోతే పోలీస్ స్టయిల్లో చెప్పించమంటావా?'' మరుక్షణం ఆమెరోదిస్తూ చెప్పనారంభించింది.

''నేను, సతీష్ని ప్రాణం కన్నా ఎక్కువగా ప్రేమించాను. మధుమిత పరిచయం కాకపోయి వుంటే సతీష్ కూడా నన్నుప్రేమించేవాడు. మధుమిత విభూషణ్రావుకి అక్రమ సంతానమని తెలిసి సతీష్ తల్లితండ్రులు వాళ్ల పెళ్ళికి అంగీకరించలేదు. నన్ను పెళ్ళి చేసుకుంటే తమకేమీ అభ్యంతరం లేదని కూడా వాళ్ళు అనడంతో, సతీష్ని ఎలాగైనా పెళ్లాడాలని నిశ్చయించుకున్నాను. మధుమితకు జరిగిందంతా చెప్పాను. కానీ, అప్పటికే తాను సతీష్ వల్ల తల్లి కాబోతున్నాని, ఎవరొప్పుకోక పోయినా తమ పెళ్లి జరిగితీరుతుందని, వచ్చి అక్షంతలువేసి వెళ్లమని చెప్పడంతో, నేను సతీష్ని ఒప్పించడానికై శత విధాల ప్రయత్నించాను. అతను ఒప్పుకోక పోవడంతో, మధుమితను చంపైనా సరే సతీష్ను పెళ్ళి చేసుకుంటానని ఆవేశం లో అన్నాను. ఈ విషయం ఎలా తెలిసిందోగాని, ప్రొఫెసర్ పరబ్రహ్మానికి తెలిసింది. మధుమితను హత్య చేశాక, అతను నన్ను బ్లాక్మెయిల్ చేయడం ప్రారంభించాడు. తనను నేను తృప్తి పరచాలని, లేకుంటే పోలీసులకి విషయం చెప్పేస్తానని అందుకే ఆ రోజు మీరతన్నికలవకముందే సైనైడ్ లో ముంచిన గుండుసూదితో మోచేతిపై గుచ్చి చంపేశాను''.

అక్కడున్న వాళ్ళంతా నిర్ఘాంతపోయారు. గుండుసూది నేలపై పడినా వినిపించేంత నిశ్శబ్దం ఆవరించిందా గదంతా.

సరిగ్గా అప్పుడు ప్రవేశించాడక్కడికి విభూషణ్ రావు విషణ్ణవదనంతో అతనితో పాటే మరో కుర్రాడు కూడా వచ్చాడు. ఆ కుర్రాణ్ణి చూశాక, సతీష్,స్నేహలత వెంటనే గుర్తించారతన్ని. అతను తమ క్లాస్మేట్ వెంకట్. తనను తాను విక్రంకి పరిచయం చేసుకున్నాక, ఆ కుర్రాణ్ణి కూడా పరిచయం చేశాడు విభూషణ్ రావు.

''మీరసలు తండ్రేనా? కన్న కూతురు దిక్కులేని చావు చచ్చిందని చెబితే, నా కూతురే కాదని చెబుతారా? పశుపక్ష్యాదులు కూడా తమ పిల్లల పట్ల ఇంత అన్యాయంగా ప్రవర్తించరు. ఐయాం సారీ మీలాంటి వాళ్ళంటే నా కసహ్యం''. కాస్త కోపంగానే అన్నాడు విక్రం. అతని మాటలకి చలించిపోయిన విభూషణ్ రావు భోరున రోదిస్తూ, ''మా కుటుంబ పరువు కోసం నేనలా చెప్పాను ఇన్స్పెక్టర్ పరువు కంటే ప్రేమే గొప్పదని నేను తెలుసుకునేసరికి ఆలస్యమైపోయింది. నన్ను క్షమించండి.''




విక్రం, వెంకట్ వైపు ప్రశ్నార్థకంగా చూశాడు.

''నేనే సార్ మొన్న ఫోన్ చేసి సతీష్ను స్నేహలత ప్రేమించిందని, మధుమితను సతీష్ పెళ్ళి చేసుకోవడం వాళ్ళ తల్లిదండ్రులకు కూడా ఇష్టం లేదని మీకు తెలియచేసాను.''

''ఓహో 'నువ్వెవరూ' అనే లోపునే ఫోన్ క్రెడిల్ చేసిన పెద్దమనిషివా?''

''అవును సార్'' తలొంచుకుని సమాధానం చెప్పాడతను.

''ఇంతకీ ఈ కేసులో నీ కెందుకింత ఇంట్రెస్ట్?'' అడిగాడు విక్రం.

''నేను స్నేహలతను ప్రేమించాను సార్ కానీ ఆ అమ్మాయి నన్ను ఛీత్కరించింది. అందుకని ఈ విషయం మీకు తెలిపితే మంచిదని''.

''మంచిదని కాదు నిన్ను ప్రేమించలేదని, కసితో చెప్పావ్ అతని మాటల్ని కట్ చేస్తూ చిరునవ్వుతో అన్నాడు విక్రమ్. అతను మౌనంగా తలొంచుకుని నిల్చున్నాడు.

''సరే యింకా ఈ కేసుకి సంబంధించిన వివరాలేమయినా నీకు తెలుసా?''

వెంకట్ చెప్పడం ప్రారంభించాడు.

''స్నేహలత వైరాలజీ పుస్తకాన్ని, లైబ్రరీ నుండి దొంగతనం చేస్తుండగా చూశాను. తర్వాత, ఏంచేస్తుందో తెలుసుకుందామని కుతూహలం కొద్ది వెంబడించా. తను పుస్తకాన్ని కాలుస్తుండడం చూచి, ఈ విషయం మీకు చెబుదామని వస్తుండగా వేదాచలం గారు ఇద్దరు లేడీ కానిస్టేబుల్స్ తో రావడం కనిపించింది. ఆ తర్వాత హాస్టల్ దగ్గర, విభూషణ్ రావుగారు కలిస్తే, ఇక్కడికి తీసుకొచ్చాను'' చెప్పడం ముగించాడతను.

ఒక్కక్షణం అతని వంక జాలిగా చూచి, స్నేహలత వైపుకి తిరిగి ప్రశ్నించాడు విక్రం.

''ఇంతకీ మధుమితను ఎలా చంపావ్?''

స్నేహలత మళ్లీ చెప్పడం ప్రారంభించింది ''మధుమిత ఒంటరిగా వుంటే చదువుతూ తినడం అలవాటు. అందుకని ఆ టైంలో నేను లేకుండా జాగ్రత్త పడ్డాను. వైరాలజీ పుస్తకంలోని ప్రతి పేజీ అంచులకు సైనైడ్పూశాను. దాంతో పేజీలు తిరగేయాలంటే, సాధారణంగా ఎవరైనా నోటితో వేలిని తడుపుకుని పుస్తకం తిరగేస్తారు. నేననుకున్నట్లుగానే తను ప్రతి పేజీని నోటితో ఎడం చేతి వేళ్లను తడిపి పుస్తకాన్ని తిరగేసింది. సైనైడ్ ప్రభావంతో వెంటనే మరణించింది'' చెప్పడం ముగించింది స్నేహలత.

ఆమె చెప్పింది విని అక్కడున్న వాళ్ళంతా నిర్ఘాంతపోయారు.

''స్నేహలత ఎంత మంచి పేరు. కానీ నువ్వెంత భిన్నంగా ప్రవర్తించావు. నిన్ను గుడ్డిగా నమ్మినందుకు నిర్దాక్షిణ్యంగా ఓ అమాయకురాలిని పొట్టనపెట్టుకున్నావు. ప్రేమ ఒన్-వే-ట్రాఫిక్ కాదు స్నేహలతా! మనది కాని మనసును స్వంతం చేసుకోవడానికై ఓ నిండు జీవితాన్నిబలితీసుకోవడం స్వార్థానికి పరాకాష్ట. ప్రేమంటే వాలెంటేన్ డే నాడు ఒకరి కళ్లల్లో ఒకరు కళ్లు పెట్టిచూసుకుంటూ ప్రపంచాన్ని మరిచి పోవడం కాదు. ప్రేమంటే ప్రకృతంత స్వచ్ఛంగా, భూమాతంత విశాలంగా, ఓర్పుగా, ఒకరికై మరొకరు జీవితాంతం వేచివుండగలగాలి అంతేకానీ, బలవంతంగా ప్రేమను పొందాలని మరొకరి ప్రాణాలు తీయడం దారుణం. ఆమధ్య జరిగిన మనోహర్కేసు అంతే. ఐయాం సారీ స్నేహలత. మధుమితను, ప్రొఫసర్ పరబ్రహ్మంను హత్యచేసినందుకు నిన్ను అరెస్ట్ చేస్తున్నాను'' గంభీరంగా చెప్పి వేదాచలం వైపు చూశాడు విక్రం.

మరుక్షణం వేదాచలం స్నేహలతను కస్టడీలోకి తీసుకున్నాడు.

★